సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

TS-20-0147370

# మన మాట

ప్రతి పదం ప్రజల పక్షం

TELANAGANA సంపుటి 7 సంచిక 212

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

బుధవారం | 4 ఫిబ్రవరి | 2026 | పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



# సమాజ సేవ అంటేనే కేరాఫ్ అడ్రస్

# రమేష్ బాబు



రాజకీయం అంటే పదవులు, అధికారం మాత్రమే కాదు.. ప్రజల కోసం నిలబడే ధైర్యం, సమస్యల కోసం పోరాడే తపన ఉంటేనే అది నిజమైన ప్రజాసేవ అవుతుందనే భావనకు నిలువెత్తు ఉదాహరణ పోచంపల్లి రమేష్ బాబు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రగతి నగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కార్పొరేటర్ పదవికి పోటీ చేస్తున్న రమేష్ బాబు.. రెండు దశాబ్దాల రాజకీయ, సామాజిక సేవా ప్రస్థానానం ఇది...

## గ్రామీణ నేపథ్యం - రాజధాని ప్రయాణం :

పోచంపల్లి రమేష్ బాబు స్వస్థలం జనగామ జిల్లా బచ్చన్నపేట. ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నారు. 1996-97 బ్యాచ్లో పదో తరగతి పూర్తిచేసి 'మండలంలో సెకండ్ ర్యాంక్' సాధించారు. చదువులోనే ప్రతిభ చూపిన రమేష్ బాబు, ఉన్నత విద్య కోసం హైదరాబాద్కు వచ్చారు.

## విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణం

హైదరాబాద్ బషీర్బాగ్లోని ఆలియా కాలేజీలో ఇంటర్మీడియట్ (ఇఇ)లో చేరారు. ఈ కాలేజీలో చదువుతున్నప్పుడే రమేష్ బాబులోని రాజకీయ చైతన్యం


ప్రగతి నగర్ నుంచి ప్రజాసేవకుడిగా...

విద్యార్థి నాయకత్వం నుంచి ప్రజా ఉద్యమాల వరకు

రెండు దశాబ్దాల అలుపెరుగని సేవాయానం

సాధారణ యువకుడి అసాధారణ రాజకీయ ప్రయాణం

ప్రగతినగర్ కార్పొరేటర్ బరిలో పోచంపల్లి రమేష్ బాబు



స్పష్టంగా బయటపడింది. విద్యార్థి దశలోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్న రమేష్ బాబు, కాంగ్రెస్ అనుబంధ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్గా పనిచేశారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నారు.








# వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ ఆదర్శం






తన రాజకీయ ప్రస్థానంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనకు ఆదర్శమని రమేష్ బాబు స్పష్టం చేస్తారు. వైఎస్ గారి అడుగుజాడల్లోనే కాంగ్రెస్లో నిజాయితీగా పని చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చాను అని ఆయన చెబుతారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత.. డిస్టెన్స్ ద్వారా డిగ్రీ చదువుతూ.. రాజకీయంగా పూర్తి స్థాయిలో ప్రజల్లోనే ఉన్నారు. అంటే.. యువకుడిగా ఉన్నప్పటినుంచే రాజకీయాలు, ప్రజాసేవకు.. చదవుకు సమాన ప్రాధాన్యత ఇచ్చారు.

## వ్యాపారంతో పాటే ప్రజాసేవ :

2005లో ప్రగతి నగర్లో స్టీల్ అండ్ సిమెంట్ ట్రేడర్స్ చిన్న వ్యాపారం ప్రారంభించారు పోచంపల్లి రమేష్ బాబు. ఓవైపు వ్యాపారం చేస్తూనే, స్థానికంగా ఉండే ప్రాంతాల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సామాజిక సేవకు వినియోగించడం ఆయనలోని ఆదర్శ భావాలకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

## 2009 - రాజకీయంగా కీలక మలుపు :

2009లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన కూన శ్రీశైలం గౌడ్కు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచారు రమేష్ బాబు. నిజాంపేట సర్పంచ్ కోలన్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ప్రగతి నగర్ ఇంచార్జ్గా పనిచేసి, శ్రీశైలం గౌడ్ను ఎమ్మెల్యేగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో 'ప్రగతి నగర్కు రమేష్ బాబు' అనే గుర్తింపు రాజకీయ వర్గాల్లో బలపడింది.

## సామాజిక సమస్యలపై పోరాటం :

ప్రగతి నగర్ స్కూల్ పక్కన శ్రీనివాస్ నగర్ కాలనీలో స్మశానానికి అవసరమైన భూమి కోసం జరిగిన పోరాటం రమేష్ బాబు జీవితంలో కీలక అధ్యాయంగా చెప్పుకోవచ్చు. అక్రమ కబ్జాలను ఎదుర్కొంటూ, స్మశానానికి సంబంధించిన స్థలం ప్రజలకు దక్కేలా ఒకరకంగా ఉద్యమమే చేశారు. అలాగే ప్రగతి నగర్లోని వందలాది పార్కులను కబ్జాల నుంచి కాపాడేందుకు తనదైన ప్రయత్నాలు చేశారు. స్థానికంగా, నాయకులు, అధికారుల చుట్టూ తిరగడమే కాదు.. ప్రజల ఆహ్లాదానికి ప్రతిరూపంగా నిలిచే పార్కుల పరిరక్షణ కోసం హైకోర్టు వరకు కేసులు వేశారు.



## 2014 - ఓటమిలోనూ సడలని సంకల్పం :

2014లో పోచంపల్లి రమేష్ బాబు ఎంపీటీసీగా పోటీ చేశారు. అయితే, దురదృష్టవశాత్తూ ఓటమి వెంటాడింది. అదే సమయంలో ఆయన భార్య కూడా వార్డు మెంబర్ గా పోటీ చేశారు. అయితే, ఆమె కూడా కేవలం ఐదు ఓట్ల తేడాతో ఓడిపోయారు. రాజకీయ కుట్రలు, కరెంట్ కట్లు, బలవంతపు సంతకాలు వంటి అనుభవాలు ఎదురైనా, రమేష్ బాబు ఎక్కడా, ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ప్రజాసేవపై ఇంకా సంకల్పం పెరిగింది. ఓడిపోయినా తాను బాధపడలేదని, తన మాతృసంస్థ అయిన కాంగ్రెస్ పార్టీ బీ-ఫామ్ మీద పోటీ చేయడం తనకు గర్వకారణంగా ఉంటుందని ఆయన అంటారు.



# కాంగ్రెస్ పార్టీలో రెండు దశాబ్దాలుగా క్రియాశీలకం

గడిచిన 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు పోచంపల్లి రమేష్ బాబు. మధ్యలో తన సేవా దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు నచ్చి ఇతర పార్టీల నుంచి ఆహ్వానం వచ్చినా... తనది కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ జెండా అని స్థిరంగా నిలిచారు. పార్టీ మారబోనని, ప్రజలకు తన పార్టీ నుంచే సేవ చేయడం తన లక్ష్యమని రమేష్ బాబు స్పష్టం చేస్తారు. అలా.. పార్టీమీద తనకు ఉన్న అభిమానం, నిబద్ధతను గుర్తించిన ముఖ్యనేతలు రమేష్ బాబుకు పార్టీలో సముచిత స్థానం కల్పించారు. ఏదైనా క్యాంపెయిన్ అయినా, ఎన్నికలుల వచ్చినా రమేష్బాబుకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగిస్తారు. అలా.. కొలన్ హనుమంత రెడ్డి ఆశీస్సులతో ప్రగతి నగర్ ఇంచార్జ్, ఎమ్మెల్యే ఎన్నికల్లో కో-ఆర్డినేటర్గా పనిచేశారు. ఫలితాలు అనుకూలంగా రాకపోయినా, నిరాశ చెందకుండా పార్టీ కోసం నిలబడ్డారు.



## 23వ డివిజన్ అధ్యక్షుడిగా తనదైన ముద్ర :

కాంగ్రెస్ పార్టీ 23వ డివిజన్ అధ్యక్షుడిగా పోచంపల్లి రమేష్ బాబుకు కీలక బాధ్యతలు అప్పగించారు పార్టీ పెద్దలు. ఆ బాధ్యతలు చేపట్టిన



తర్వాత 2 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయించారు. రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు.. ఇలా ప్రతి అంశంలోనూ తమ పార్టీ ముఖ్యనేతల సహకారంతో, ప్రత్యక్షంగా అధికారులతో మాట్లాడి, వెంటపడి పనులు చేయించారు.


## పార్కులు - ఆహ్లాదానికి చిరునామాలు :


ప్రజలందరికీ ఉపయోగపడే, అందరికీ ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కుల గురించి పోచంపల్లి రమేష్బాబు ఎప్పుడూ ఆలోచిస్తారు. సామాజికంగా ఉపయోగపడాల్సిన అలాంటి స్థలాలు స్వార్థపరుల చేతుల్లో చిక్కితే విలవిల్లాడిపోతారు. ఎందాకైనా... వెళ్లేందుకు సిద్ధంగా ఉంటారు. అలా.. సాయి కీర్తి లేఔట్ పార్కు కబ్జా నుంచి విడిపించడంలో అమోఘమైన పాత్ర పోషించారు. ఆ పార్కులో చిన్నారులకు ఆటల సామగ్రి ఏర్పాటు చేయించారు. ఇదొక్కటే కాదు.. మదర్ థెరిస్సా పార్క్, బాబు జగ్జీవన్రావు పార్కుల్లో 26 లక్షల రూపాయలతో ఓపెన్ జిమ్, లైటింగ్, క్రికెట్ నెట్స్ ఏర్పాటు చేయించారు. అలా.. పార్కుల వైపు వెళ్లినప్పుడు పిల్లలు ఆడుకుంటూ ఆనందంగా గంతులు వేస్తూ ఉంటే.. చాలా సంతోషంగా ఉంటుందంటారు పోచంపల్లి రమేష్ బాబు.

## మాటలు కాదు.. చేతల్లో సేవ :

సామాజిక సేవ అంటే పోచంపల్లి రమేష్బాబు ముందుంటారు. ప్రచారం కాదు.. చెప్పుకోవడం వద్దు.. అవసరమైన వాళ్లకు మనతో అయిన కాడికి చేశామా. లేదా? అన్నదే ముఖ్యమంటారు. అలా.. బొల్లారంలోని ఎయిడ్స్ బాధిత పిల్లలకు ప్రతి సంవత్సరం దుప్పట్లు, నిత్యావసరాలు అందిస్తూ ఉంటారు. అలాగే, మెహదీపట్నంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమానికి విరాళాలు అందజేశారు. వివేకానంద నగర్ సమీపంలో ఉన్న కుష్టు బాధితుల కేంద్రానికి కూడా తనవంతు సహాయం అందించారు. మధుర నగర్లో అనాథ పిల్లలకు పుస్తకాలు, బియ్యం, పప్పులు వంటి







నిత్యావసరాలు అందిస్తూ.. తన సేవను కొనసాగిస్తున్నారు.

## వైద్యం - ప్రాణాలు కాపాడే మానవత్వం :

బస్ యాక్సిడెంట్లో కాలు విరిగిన ఒక విద్యార్థికి దగ్గరుండి ఆపరేషన్ చేయించడమే కాదు.. హాస్పిటల్ ఫీజు కూడా తగ్గించేలా యాజమాన్యంతో మాట్లాడారు. మరో సంఘటనలో కత్తుల దాడిలో గాయపడ్డ ఒక కార్మికుడికి హాస్పిటల్ లో లక్షల రూపాయల బిల్లును తగ్గించేలా వైద్యులను ఒప్పించారు. పూర్తిస్థాయిలో అవసరమైన చికిత్స చేయించారు. ఇలాంటివన్నీ మచ్చుకు రమేష్ బాబు మౌనంగా చేసిన సేవలు. కానీ, ఎవరికీ చెప్పుకోరు.

## కరోనా - కష్టకాలంలో తోడుగా...

లాక్డౌన్ సమయంలో అడ్డగుట్ట, జేఎన్టీయూ వంటి ప్రాంతాల్లో పేదలకు బియ్యం, నిత్యావసరాలు, నగదు సహాయం అందించారు. దేవుడు తనకు ఇచ్చినంతలో, నలుగురికి ఎంతో కొంత ఇవ్వడమే నిజమైన పూజగా పోచంపల్లి రమేష్ బాబు అభివర్ణిస్తారు.







# నీటి సమస్యలపై ఉద్యమం

సేవలు చేయడమే కాదు.. సమస్యలొస్తే నేనున్నా నంటూ ముందు వరుసలో నిల్చుంటారు పోచంపల్లి రమేష్బాబు. ప్రజల సామూహిక సమస్యల పరిష్కారం కోసం నాయకత్వం వహిస్తారు. అలా.. ప్రగతి నగర్లో నీటి సమస్యపై అనేక ధర్నాలు చేశారు. అధికారులకు, నాయకులకు మెమోరాండాలు ఇచ్చారు. స్థానికంగా అధికారుల వరకే పరిమితం కాకుండా.. జీహెచ్ఎంసీ కమిషనర్ వరకు సమస్యనను తీసుకెళ్లడంలో రమేష్ బాబు పాత్ర మరువలేనిది. భారీ వర్షాలు ముంచెత్తిన సమయంలో పలు అపార్ట్మెంట్ల సెల్లార్లు మునిగిపోయినప్పుడు, చెట్లు విరిగిపోయినప్పుడు మున్సిపల్ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో నేనున్నానంటూ స్వయంగా పాల్గొంటారు.

## రేవంత్ రెడ్డి - రాజకీయ ప్రేరణ

సాధారణ జీవితంతో రాజకీయాల్లో ఎదిగి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని, అదే మార్గంలో నడవాలనే సంకల్పంతో కాంగ్రెస్లోనే కొనసాగుతున్నానని రమేష్ బాబు చెబుతారు. దేశంలోనే అతిపెద్ద లోక్సభ నియోజకవర్గమైన తమ పరిధిలోని మల్కాజ్గిరి నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి ఎంపీగా పోటీచేసినప్పుడు తమప్రాంతంలో ప్రత్యేకంగా తానే బాధ్యతలు తీసుకొని ఆయన గెలుపుకోసం కృషి చేశారు రమేష్ బాబు. ఆ తర్వాత అంచెలంచెలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదగడం ఆయన కృషి, పట్టుదల, నిబద్ధతకు నిదర్శనమని, వాటినే నేను ఫాలో అవుతానని రమేష్ బాబు చెబుతారు.

## బాధలు, అవమానాలు - అయినా వెనుకడుగు లేదు :

2014లో ఎంపీటీసీగా తాను ఓడిపోవడం, మరోవైపు.. వార్డు మెంబర్గా తన భార్య ఓటమి, అలాగే, ఎమ్మెల్యేగా కొలను హనుమంత రెడ్డి ఓడిపోయిన రోజు.. ఇవన్నీ తనను ఎంతగానో బాధపెట్టిన సంఘటనలని రమేష్ బబు చెబుతారు. అయితే తప్పుడు కేసులు, నిందలను ధైర్యంగా ఎదుర్కొని, తనపై ఒక్క కేసు కూడా లేకుండా రాజకీయంగా తలెత్తుకొని నిలిచిన గర్వం ఆయనలో కనిపిస్తుంది.

## కార్పొరేటర్ - పదవి కోసం కాదు.. ప్రగతి నగర్ సమగ్ర అభివృద్ధి కోసం...

ఇప్పటికే ప్రజాసేవలో కొనసాగుతున్న తాను.. కేవలం పదవికోసమే కార్పొరేటర్గా పనిచేయడం లేదంటారు రమేష్ బాబు. ప్రగతినగర్ సమగ్ర అభివృద్ధికోసం తనకొక విజన్ ఉందని చెబుతారు. కార్పొరేటర్ అయితే, అభివృద్ధిలో మరింత దూసుకువెళ్లేలా చేయొచ్చని ధీమాగా చెబుతారు. అందులో భాగంగానే.. ఆయన ప్రణాళికల్లో కొన్ని పంచుకున్నారు. జేఎన్టీయూ నుంచి ప్రగతి నగర్ వరకు విశాలమైన రోడ్డు అవసరమని, అంతేకాదు.. ఆ మార్గంలో ఫ్లైఓవర్ నిర్మాణం ఆవశ్యకతను ఆయన వివరిస్తారు.

ఈ ప్రాంతంలోని ప్రజలకోసం అధునాతన స్మశాన వాటిక అవసరమని, అలాగే, తాగునీటికి శాశ్వత పరిష్కారం చేయాల్సి ఉందని, ఇప్పుడున్న డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగ్గా మార్చాల్సి ఉందని రమేష్ బాబు చెబుతున్నారు. ప్రగతి నగర్ కార్పొరేటర్గా ప్రజలు తనను గెలిపిస్తే, ఇప్పటివరకు చేసిన, ఇప్పుడు చేస్తున్న సేవకు రెట్టింపు సేవ చేస్తానని, హామీ ఇస్తున్నారు. ఎక్కడ అవసరం ఉంటే అక్కడ అధికారులను వాలేలా చేస్తానంటున్నారు.







## ప్రజాసేవకుడి వినతి :

కమ్యూనిస్టు నేపథ్యంతో పెరిగిన కుటుంబం నుంచి వచ్చిన రమేష్ బాబు, నీతి, నిజాయితీలే తన బలం అంటారు. ప్రగతి నగర్ ప్రజల ఆశీర్వాదంతో కార్పొరేటర్గా గెలిచి, మరింత సేవ చేయాలనే సంకల్పంతో బరిలో దిగుతున్నట్లు చెప్పారు. ఇటు ప్రజాసేవలో, అటు రాజకీయ పార్టీలో తనకున్న అనుభవంతో మెరుగైన ప్రగతినగర్ను తయారుచేసి చూపిస్తానని హామీ ఇస్తున్నారు. తన రెండు దశాబ్దాల ప్రజాసేవా ప్రయాణం, రాజకీయ పయనానికి కార్పొరేటర్గా గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అనిల్ కుమార్ కుంట....
సందేశ్ మీడియా...
93933 44405



